




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం | 19 ఆగస్టు 2025

పేజీలు 8


# ఆకాశానికి చిల్లు

- ఏకధాటిగా 12 గంటల పాటు కురిసిన వర్షం
- జలమయమైన పంట పొలాలు
- కృష్ణా,తుంగభద్ర నదులకు భారీ వరద
- శ్రీశైలం డ్యాం వద్ద 10 గేట్లు ఎత్తివేత

**కర్నూలు,మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా సుమారు 12 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఎడతెరిపి లేని వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు నీటితో నిండిపోయాయి. దీంతో రైతన్నకు తీరని నష్టం వాటిల్లింది. తుంగభద్ర, కృష్ణా, కుందూ తదితర నదుల్లో వరదనీరు పోటెత్తుతోంది. వరద జలాలు భారీగా చేరుతుండడంతో సోమవారం శ్రీశైలం డ్యాం వద్ద 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటికే కృష్ణా బేసిన్‌లోని నదులన్నీ వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. మరో రెండు రోజుల పాటు అల్పపీడన ప్రభావం ఉంటుందంటూ వాతావరణ శాఖ అంచనాలు వేస్తు న్న తరుణంలో ప్రజలు భయాం దోళనలో ఉన్నారు. కర్నూలు జిల్లాలోని 26 మండలాల్లోనూ వర్షం కురిసింది. కల్లూరులో అత్యధికంగా 39.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా హోళగుంద, మద్దికెర ఈస్ట్ మండలాల్లో4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో కూడా 30 మండలాల్లో వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో నందికొట్కూరులో అత్యధికంగా 54 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పం గా ప్యాపిలి మండలంలో 5.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.భారీ వర్షాలు కురుస్తున్న

మిగతా 2లో

## తుంగభద్రకు పోటెత్తిన వరద

- 28 క్రస్‌గేట్ల ద్దారా నదికి నీరు విడుదల

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** కర్ణాటక విజయనగర (హోస్పేట్) జిల్లా కేంద్రంలో ఉన్న తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటేత్తింది. జలాశయం ఎగువ ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్నా వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఆ కారణంగా డ్యాంకు ఉన్నా 33 క్రస్ గేట్లులో 19వ గేటును మినాయించి 28 గేట్లు ద్వార 90 వేల క్యూసేక్స్‌లకు పైగ నీటిని నదికి విడుదల చేశారు.

మిగతా 2లో



తుంగభద్ర జలాశయం 28 గేట్ల ద్వార నదికి విడుదల చేసిన నీరు

## శ్రీశైలం డ్యాంకు భారీగా వరద

- జలాశయం 10 గేట్ల నుంచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల
- ఒక్క రోజులోనే ఏడు గేట్లు ఎత్తివేత
- ఇన్ ఫ్లో 3,29,145 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 3,66,589 క్యూసెక్కులు
- డ్యాం నీటిమట్టం 881.60 అడుగులు

2లో



## ప్రభుత్వ బాలుర వసతిగృహంలో ఫుడ్‌పాయిజన్

- 20 మంది పిల్లలకు అస్వస్థత
- భోజనం సరిగ్గా వండరంటూ విద్యార్థుల ఆవేదన
- హాస్టల్ వార్డెన్ పై కంప్లైట్ ఇవ్వడానికి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లిన విద్యార్థులు..



అస్వస్థతకు గురైన విద్యార్థులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఆదివారం రాత్రి భోజనం చేసినప్పటి నుంచి దాదాపు 20మంది విద్యార్థులు

మిగతా 2లో



కుళ్లిపోయిన కూరగాయలు

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించని అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా వినతులు స్వీకరించిన అనంతరం ఆయన సమీక్ష సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజా అర్జీల పరిష్కారంపై

మిగతా 2లో



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

## ఉధృతంగా పెద్దవాగు ప్రవాహం



ట్రాక్టర్ సాయంతో వాగును దాటుతున్న ప్రజలు

- 11 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- అత్యవసర సమయాల్లో ట్రాక్టర్‌తో వాగును దాటుతున్న వైనం
- గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారుల సూచన

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వాలు మారినా పెద్దవాగు వద్ద హైలెవెల్ వంతెన నిర్మాణానికి అడుగులు పడటం లేదు. ఒక మోస్తారు వర్షం కురిస్తే చాలు శివపురం వద్ద ఉన్న పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని దాదాపు 11 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. శివపురం వద్ద గల పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వారం రోజుల వ్యవధిలోనే ఈ వాగు

మిగతా 2లో

## మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మిక కరవు

- వ్యాపార సముదాయంగా మారిందని భక్తుల ఆవేదన
- వినపడని ఓంకార నామం
- తమదైన శైలిలో విమర్శిస్తున్న భక్తులు



మహానంది క్షేత్ర దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత పూర్తిగా కనుమరుగైందని వ్యాపార సముదాయంగా మారిందని భక్తులు, ప్రజలు తమదైన శైలిలో విమర్శిస్తున్నారు. ఉదయం లేస్తే రాత్రి వరకు మైకు ద్వారా వ్యాపారాలకు సంబంధించిన ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఏ సమయంలోనూ ఆధ్యాత్మిక చింతనను కలిగించే ఓంకార ప్రణవనాదం గానీ భారత రామాయణం, భాగవతాలు గానీ వినపడనే వినపడవు అంటూ విమర్శిస్తున్నారు. ఇది దేవాలయమా లేక వ్యాపార సంస్థనా అంటూ భక్తులు విమర్శిస్తున్నారు. 24 గంటలు గదులు అద్దెకు అంటూ, పలు టెండరుదారులు విక్రయించే వస్తువుల ధరలు చెప్తున్నారే తప్ప ఎక్కడా దైవ చింతన లేకుండా పోయిందని భక్తులు పేర్కొంటున్నారు. దేవాలయాలు అంటే స్వామి నామ సంకీర్తనలు, పలు భక్తి పాటలు, రామయణ, భాగవతాలు వినిపిస్తే భక్తులం దేవాలయానికి వచ్చామనే ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని 24 గంటలు వ్యాపార ప్రకటనలు చేస్తుంటే

మిగతా 2లో

# తుంగభద్రకు పోటెత్తిన వరద

(మొదటి పేజీ తరువాయి)

జలాశయం గరిష్ట పూర్తి నీటిమట్టం 1633 అడుగులు కాగ 1625,16 అడుగుల నీరు చేరింది.గరిష్ట కెపాసిటి 100.05 టీఎంసీల నీటి సామర్ధ్యం కాగ 77.012 టిఎంసీల నీటి నిల్వ ఉంది.జలాశయానికి ఇన్‌ఫ్లో 65 వేల క్యూసెక్స్‌ల నీరు చేరుతుంది.అవుట్ ఫ్లో 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.మంగళవారం లక్షా క్యూసెక్స్‌లకు పైగా నీటిని నదికి విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు.డ్యాం గేట్లును బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి,బోర్డు ఎస్పీ నారాయణనాయక్ పరిశీలించారు.ప్రస్తుతం డ్యాం గేట్లకు ఎలాంటి ముప్పు లేదని డ్యాంకు భారీగా వరద చేరితే గేట్లు ద్వార భారీగా నీటిని విడుదల చేస్తే ఆలోచించాల్సి ఉంటుందన్నారు. అయితే 4,7,11,20,24,27,28 ఆ 7 గేట్లు భద్రత లేదని చెప్పారో ఆ గేట్లు ద్వార సోమవారం నీటిని నదికి విడుదల చేస్తున్నారు.డ్యాం గేట్లు భద్రతగా ఉండాలని కర్ణాటక,ఆంధ్రా,తెలంగాణ రైతులు దేవుళ్ళను ప్రార్థిస్తున్నారు.

# మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మికత కరవు

(మొదటి పేజీ తరువాయి)

మేము దేవాలయంలో ఉన్నామా లేక వ్యాపార సముదాయాల వద్ద ఉన్నామా అనే భావన కలుగుతోందని భక్తులు పేర్కొంటున్నారు. గ్రామ దేవతల దేవాలయాల వద్ద ఆధ్యాత్మిక భావనలు కలిగించే పాటలను పెడతారు గానీ ఇలాంటివి ఎక్కడా వినలేదని ఇది కేవలం మహానంది క్షేత్రానికి మాత్రమే పరిమితమైందని భక్తులు విమర్శిస్తున్నారు. మైకులు భారీ స్థాయిలో సౌండ్‌లు పెడుతూ దేవాలయంలో ప్రశాంతంగా నమస్కారం చేసుకోవాలన్నా చెవులలో ఈ మైకు శబ్దాలే వినిపిస్తున్నాయని ప్రశాంతంగా భక్తి భావంతో స్వామి, అమ్మవార్ల ను నమస్కారం చేసుకోలేకపోతున్నామంటూ భక్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దేవాల య అధికారులు తగు చర్యలు తీసుకుని దేవాలయ పరిధిలో భక్తి భావాన్ని పెంపొందించే ఓంకార నామస్మరణ వినిపించేలా చర్యలు తీసుకోవాలని వేద మంత్రాలు వినిపించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోందని, కొంతమంది అధికారులపై ప్రతికూల అభిప్రాయం వస్తోందని ఇది తగదన్నారు. ప్రజలతో సానుకూలంగా మాట్లాడి గడువులోపే సమస్యలను పరిష్కరించాలని హెచ్చరించారు. ఆదోని మున్సిపల్ కమీషనర్ వద్ద 5, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వద్ద 2, వక్ఫ్‌బోర్డు ఇన్స్పెక్టర్ వద్ద 1 అర్జీ గడువు దాటినా పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టర్ గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఓను ఆదేశించారు. అలాగే కర్నూలు వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ వద్ద 18రోజులుగా ఒక అర్జీ పెండింగ్‌లో ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమీషనర్‌కు సూచించారు. అలాగే సబ్ రిజిస్టర్ కర్నూలు వద్ద 14రోజులుగా ఒక అర్జీ, గూడూరు కమీషనర్ వద్ద 12రోజులుగా ఒక అర్జీ, కృష్ణగిరి తహశీల్దార్ వద్ద 3అర్జీలు, తుగ్గలి తహశీల్దార్ వద్ద 2అర్జీలు, 7రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. మెమోలు ఇవ్వడం సరిపోదని గడువు దాటితే అవసరమైతే సస్పెన్షన్ వరకు వెళ్లాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సిఎంఓ గ్రీవెన్స్ విషయంలో ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 11, కర్నూలు ఆర్డీఓ వద్ద 7, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, కలెక్టరేట్ ఏఓ 3, సర్వే ఏడి ఒక దరఖాస్తూప్పన పెండింగ్‌లో ఉన్నాయని, అవి బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య, డిఆర్ఓ సి వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉధృతంగా పెద్దవాగు ప్రవాహం

(మొదటి పేజీ తరువాయి)


నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ ఉమారాణి

మూడు సార్లు ఉధృతంగా ప్రవహించింది. దీంతో మండలంలోని శివపురం, శింగరాజుపల్లి, గుమ్మడాపురం, ముసలి మడుగు, ఎర్రమటం, ఇంకా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కొలనుభారతి, సంఘమేశ్వరం వెళ్లే భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో సోమవారం ఈ వాగును ట్రాక్టర్ సాయంతో దాటుతున్నారు. ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో తహశీల్దార్ ఉమారాణి, ఎస్సై జయశేఖర్‌లు వాగు వద్దకు వచ్చి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ వాగును ఎవరు దాటకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అక్కడ ఉంచారు. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ పెద్దవాగు వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరారు.


ఎత్తైన కొండల నుంచి ప్రవహిస్తున్న నీరు

**కొలనుభారతిలో.. జాలువారుతున్న జలపాతాలు :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొలనుభారతి పుణ్య క్షేత్రానికి సమీపంలో ఎత్తైన కొండల నుంచి జల పాతాలు దర్శనమిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఈ జలపాతాలు సుందరంగా దర్శనమిస్తున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారి ఎత్తైన కొండల నుంచి వర్షపు నీరు కిందికి వస్తుండటంతో జలపాతాలు సుందర దర్శనమిస్తున్నాయి. ఈ జలపాతాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలి వస్తున్నారు. ఈ సుందర జలపాతాలు నల్లమల అటవీ ప్రాంతం గుండా ప్రవహించి ఒక నదీ ప్రవాహంలో జాలువారుతున్నాయి.

# ఆకాశానికి చిల్లు

(మొదటి పేజీ తరువాయి)

నేపధ్యంలో అధికార యంత్రాంగం అప్రత్తంగా ఉండాలని, అవసర మైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రాష్ట్ర మంత్రులు టి.జి.భరత్, బి.సి.జనార్దన్‌రెడ్డి అధికారుల ను ఆదేశించారు. తుంగభద్ర నదికి పెద్ద ఎత్తున వరదనీరు చేరుతుండడంతో సమీప ప్రాంత ప్రజలను అప్రమత్తులను చేసినట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. అలాగే కుందునది తీర ప్రాంతాల్లో అప్రత్తంగా ఉన్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి చెప్పారు.

**శ్రీశైలం డ్యాం వద్ద 10 గేట్లు ఎత్తివేత :** కృష్ణా, తుంగభద్ర నదుల నుండి పెద్ద ఎత్తున వర దనీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం అధికారులు డ్యాం వద్ద 10 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుండి 2,38,000 క్యూసెక్‌ల వరద నీరు శ్రీశైలం చేరుతుండగా, తుంగభద్ర నది నుండి సుంకేసుల బరేజ్ ద్వారా 87,158 క్యూసెక్‌ల నీరు వస్తోంది. హంద్రీ నది నుండి కూడా 3,750 క్యూసెక్‌ల వరద వస్తోంది. సోమవారం సాయంత్రం 7 గంటల సమయానికి డ్యాంలోకి 3,00,174 క్యూసెక్‌ల వరద నీరు వస్తోంది. 12 అడుగుల ఎత్తున 10 గేట్లు ఎత్తి 3,04,210 క్యూసెక్‌ల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి రాయలసీమకు 30వేల క్యూసెక్‌ల కృష్ణానది జలాలను తరలిస్తుండగా, హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,818 క్యూసెక్‌లు, విద్యుత్ ఉత్పత్తి కోసం 66,099 క్యూసెక్‌లు వినియోగిస్తున్నారు. గేట్ల ద్వారా, వివిధ కాలువల ద్వారా 4,03,127 క్యూసెక్‌ల వరద నీరు దిగువకు తరలి వెళుతోంది. కృష్ణా నది బేసిన్‌లోని ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల ప్రాజెక్టుల వరద నీటితో కళకళలాడుతున్నాయి.

**తుంగభద్ర నదికి భారీ వరద :** ఏపితో పాటు కర్నాటక రాష్ట్రంలోనూ భారీ వర్షాలు నమోదు అవు తుండగా, తుంగభద్ర నది వరద నీటితో పోటెత్తుతోంది. కర్నాటకలోని తుంగభద్ర డ్యాంలోకి 64,081, క్యూసెక్‌ల వరద నీరు వచ్చి చేరుతోండగా, 86,606 క్యూసెక్‌ల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని సుంకేసుల బ్యారేజీకి మంగళవారం ఉదయానికి 1.20 లక్షల క్యూసెక్‌ల నుండి 2 లక్షల క్యూసెక్‌ల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. మంత్రాలయం వద్ద వరద పోటెత్తే అవకాశం ఉండడంతో భక్తులు అటు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. కర్నూలు నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను కూడా అప్రమత్తంగా ఉంచాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

# శ్రీశైలం డ్యాంకు భారీగా వరద



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో సోమవారం మూడు గేట్ల ద్వారా నాగార్జునసాగర్కు నీటి విడుదల కొనసాగిస్తున్న అధికారులు ఒక్క రోజు వ్యవధిలో ఉన్న 7 గేట్లు నెత్తి సాయంత్రం సమయానికి మొత్తం 10 గేట్లు 12 అడుగుల ఎత్తి 3,04,690 క్యూసెక్కులు రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66,099 క్యూసెక్కులు మొత్తంగా 3,66, 589 క్యూసెక్కులనీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా సోమవారం సాయంత్రం 6 గంటలకు డ్యామ్ నీటిమట్టం 881.60 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం197.0114 టీఎంసీలకు చేరింది.ఇదే సమయానికి జూరాల,సుంకేసుల, హంద్రీ ప్రాజెక్టుల ద్వారా 3,29,145 క్యూసెక్కుల వరద నీరు వచ్చి శ్రీశైలానికి చేరింది.కర్ణాటక మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా కృష్ణ,తుంగభద్ర నదులు పోటెత దంతో శ్రీశైలానికి వరద ప్రవాహం మరింత ఉధృతంగా ప్రవహిస్తుంది. జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడుకు 30 వేల క్యూసెక్కులు,హెచ్ఎన్ఎస్ఎస్ కు 2,426 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 30,757 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 15.340 మిలియన్ యూనిట్లు,ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,316 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 16.920 మిలియన్ యూనిట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు.

# ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఫుడ్ పాయిజన్

(మొదటి పేజీ తరువాయి)


ప్రభుత్వ బాలుర వసతి గృహం

వాంతులు, విరేచనాలు చేసుకున్నామని విద్యార్థులు తెలిపారు. హాస్టల్‌లో కేర్ టేకర్ లేకపోవడం వలన వంట మనిషి ఉన్నా విద్యార్థులను పట్టించుకోకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. వాంతులు, విరేచనాలతో విద్యార్థులు ఉదయాన్నే వర్షం లోనే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి చికిత్స కోసం వెళ్లగా ఎవరినైనా పిలుచుకుని రావాలని, పిల్లల డాక్టర్ వచ్చాక రావాలని తెలిపార ని విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు విద్యార్థులు కంప్లైంట్ ఇవ్వడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న సూర్య ప్రతినిధి హాస్టల్ వార్డెన్‌ను చరవాణిలో సంప్రదించగా వంట మాస్టర్ తనకేమీ చెప్పలేదని, విద్యార్థులకు ఏమీ కాలేదని నేను కర్నూలులోఉన్నాను వస్తున్నానని తెలిపి సోమవారం ఉదయం 9.30 గంటలకు హాస్టల్‌కు చేరుకున్నారు. ఈ విషయంపై మండల తహశీల్దార్‌కు సవచారం ఇవ్వగా వెంటనే స్పందించి విఆర్ఓను అక్కడికి పంపి విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ఘటనపై హాస్టల్‌లో ఫోటోలు తీయడానికి విలేకర్లు వెళ్లగా తీయొద్దంటూ అడ్డు చెప్పారు. స్టోర్‌రూంలో కుళ్లిపోయిన కూరగాయల దృశ్యాలు కనిపించాయి. విద్యార్థులు ఈ కూరగాయలతోనే మాకు భోజనం పెడుతున్నారని తెలిపారు. కొంతమందికి రక్తపు వాంతులు కూడా చేసుకున్నారని, కుళ్లిపోయిన ఆకుకూరలతో పప్పు చేసినందువలనే ఈ విధంగా జరిగిందని, రెండ్రోజులుగా అదే పప్పు చేసి మాకు భోజనాలు పెట్టారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌ను ఉన్నతాధికారులు తనిఖీ చేయకపోవడం వలనే ఈ విధంగా జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న విఆర్ఓ

**రెగ్యులర్ వార్డెన్‌ను నియమించి నాణ్యమైన భోజనం అందించాలి :** సంక్షేమహాస్టల్‌కురెగ్యులర్‌వార్డెన్‌ను నియమించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ కు కారణమైన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌విఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, రైతు సంఘం మండల కార్యదర్శి సుధా కర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహబూబ్ బాషాలు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకుని హాస్టల్ సందర్శించడానికి వెళ్లగా హాస్టల్ లోకి వార్డెన్ అనుమతించలేదని, ఎస్‌సి సాంఘీక సం క్షేమ బాలుర హాస్టల్‌కు ఇంచార్జ్ వార్డెన్ ఉండడం వలనే విద్యార్థుల ను పట్టించుకునే నాధుడు కరువయ్యారన్నారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్, ఎంఈఓ ఓంకార్ యాదవ్ లకు వినతిపత్రాలు అందచేశారు. విద్యా ర్థులకు సమస్యలు తలెత్త కుండా చూస్తామని హాస్టల్‌వార్డెన్‌పై చర్యలుతీసుకుంటామని తెలిపారన్నారు.

## నిర్ణీత గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం

### - కమీషనర్ పి.విశ్వనాథ్



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులకు నిర్ణీత గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. అంతకుముందు గార్గేయపురం డంప్‌యార్డులో ఘన వ్యర్థాలతో 15మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్లాంట్ నిర్మాణ ప్రక్రియపై జపాన్ దేశానికి చెందిన నిపుణులతో కమీషనర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్‌చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ శ్రీనివాసులు, డిఈఈ గంగాధర్, క్రిష్ణలత, ఏఈ వైష్ణవి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**సంజామలమేజర్,న్యూస్:** సంజామల మండలం గిద్దలూరు గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి జీర్ణోద్ధరణ, ధ్వజ, శిఖర, కళశ ప్రతిష్ట మహోత్సవానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైకాపా నాయకుడు రామచంద్రా రెడ్డి, వైకాపా నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

## ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి..!

- పరికరాల భద్రత కోసమే గదికి తాళం వేశారు
- రాష్ట్రంలోనే డెలివరీలో ఎమ్మిగనూరు మొదటి స్థానం
- క్రిటికల్ కేర్ యూనిట్ కోసం ప్రతిపాదన పెట్టాం
- ఫిజీషియన్ డాక్టర్‌ను ఏర్పాటు చేస్తున్నాం
- తప్పుడు సంకేతాలు ఇవ్వకుండా.. మంచిని ముందుకు తీసుకెళ్లాలి - ఎమ్మెల్యే బీవీ




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆసుపత్రిలో హెచ్ డిబి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రస్తుతం ఓటి( ఆపరేషన్ థియేటర్ ) ఓల్డ్ బ్లాక్ లోనే కొనసాగుతున్నాయని, కొత్త బ్లాక్ లో ఉన్న ఓటి పరికరాల భద్రత కోసం సిబ్బంది గదికి తాళం వేశారని దీన్ని కొందరు ఆస్పత్రికి తాళం వేశారని తప్పుడు ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. నిన్నటి రోజు ( ఆదివారం) నాడు ఆస్పత్రిలో ఏడు డెలివరీ, ముగ్గురికి ఎం.ఎల్. సీ (మెడికల్ లీగల్ కేసు), 79 ఓపి మందికి సేవలందించారని, అలాగే ఒక పోస్టుమార్టం కూడా చేశారని వివరించారు. ఆసుపత్రికి తాళాలు వేస్తే ఈ సేవలు ప్రజలకు ఎలా అందుతాయని ప్రశ్నించారు. తప్పుడు ప్రకటన ద్వారా ఆస్పత్రి ప్రతిష్టను దెబ్బ తింటుందని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఇక్కడి వైద్యులు మంచి సేవలు అందిస్తున్నారని, ఇంకా కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వానికి ప్రతిపాదన పంపడం జరిగింది తెలిపారు. గత కాంట్రాక్టర్ ఆసుపత్రిలో ఓపి గది కట్టకుండా నిర్మాణం చేసి వెళ్లిపోయారని కూటమి ప్రభుత్వం వచ్చాక తాను ఓపి గది ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరోపక్క ఇక్కడకు ఫిజీషియన్ వైద్యులను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఎమ్మిగనూరు ఆసుపత్రి డెలివరీలో మొదటి స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్ కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో కావాల్సిన సిబ్బం దిని పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు సంకేతాలు ఇవ్వకుండా ప్రజలకు మంచి జరిగే విషయాలు కూడా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సమావేశంలో సూపర్డెంట్ సుధా, వైద్యులు మల్లికార్జున, కమిటీ సభ్యులు రామకృష్ణ నాయుడు, సురేష్ చౌదరి, అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వకుండా ఇళ్లకు మార్కింగ్



మాట్లాడుతున్న బండి ఆత్మకూరు బస్ స్టాండ్ బాధితులు

**బండి ఆత్మకూరు రూరల్,మేజర్ న్యూస్ :** తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నేషనల్ హైవే అధికారులు తమ ఇళ్లకు మార్కింగ్‌లు వేశారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు బండి ఆత్మకూరు బస్టాండు ప్రజలు విన్నవించుకున్నారు. బస్టాండులో నివసిస్తున్న రఫీ, జాహిద్,వెల్డింగ్ భాష,బుజ్జి,చాంద్ తదితరులు సోమవారం స్థానిక బండి ఆత్మకూరు రెవెన్యూ కార్యాలయంలో, కలెక్టర్ కార్యాలయం జరుగుతున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నారు. కల్వకుర్తి నంద్యాల 167 హైవేలో ప్రభుత్వం నిర్దేశించిన మ్యాప్ ప్రకారం కాకుండా , ప్రభుత్వం జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్ ప్రకారం కాకుండా సర్వే నెంబర్లు 460, 461 లలో నివాసం ఉంటున్న తమ ఇళ్లకు మార్కింగ్ లు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై గతంలో అప్పటి నంద్యాల జాయింట్ కలెక్టర్ కి సమస్యను తీసుకెళ్లగా అప్పట్లో ఆర్డీవో తహసిల్దారు మండల సర్వేయర్ తో సర్వే చేయించి హద్దులు నిర్ణయించారన్నారు. కానీ హైవే అధికారులు శని, ఆదివారాలలో బస్టాండ్ ప్రాంతంలోని తమ ఇళ్లకు ఎలాంటి సమాచారం లేకుండానే మార్కింగ్ లు వేశారన్నారు. నేషనల్ హైవే అథారిటీ విడుదల చేసిన గజిట్ లో తమ నివాస గృహాలు లేవని , అలాగే అవార్డులో కూడా తమ పేర్లు లేవని ప్రభుత్వం నుండి ఎటువంటి నోటీసులు కానీ నష్టపరిహారం కానీ అందలేదని అయినప్పటికీ హైవే అధికారులు తీరు పట్ల అసహన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్లు 460,461 లలో నేషనల్ హైవే 167 కే కి సంబంధించి సర్వేల సమక్షంలో సరిహద్దులు నిర్ణయించాలని అధికారులను కోరారు.

**అధికారుల సమక్షంలో సర్వే చేపడతాం :** పి జి ఆర్ ఎస్ లో ఇచ్చిన సమస్యపై స్థానిక తహసిల్దారు పద్మావతమ్మకు వివరణ కోరగా నేషనల్ హైవే జె ఈ రవికాంత్ తో మాట్లాడడం జరిగిందని, హైవే రోడ్డు కాంట్రాక్టర్లు తీసుకున్న వారు మార్కింగ్ వేశారని తమ దృష్టికి తెచ్చినట్టు తెలిపారు. అలాకాకుండా స్థానిక మండల మండల సర్వేయర్ తో బస్టాండ్ ప్రజల సమక్షంలో సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలని హైవే రమాకాంత్ కు సూచించినట్లు తహసిల్దారు తెలిపారు. వీలైనంత త్వరలో మండల సర్వే అధికారులు, హైవే అధికారుల సమక్షంలో సర్వే నిర్వహిస్తామని తహసిల్దారు ఒక ప్రకటనలో తెలిపారు.



మాట్లాడుతున్న తహసిల్దారు పద్మావతమ్మ

## పంటల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వ్యవసాయాధికారి మధుమతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** అధిక వర్షాలు పడుతున్న తరుణంలో రైతులు వేసిన వివిధ పంటలకు తగిన జాగ్రత్తలు తీసుకుని పంటలను రక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మధుమతి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి, టమోటా, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు నీటి ముంపుకు గుర్యాయని అన్నారు. తగిన జాగ్రత్తలు పాటించి రైతులు తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. పత్తి పంట నీట ముంపుకు గురైనప్పుడు పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారి పడిపోతాయన్నారు. నీటిని తీసివేయడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పొటాషియం, నైట్రేట్ ఐదు గ్రాములు లీటరుకి లేదా 10గ్రాముల యూరియాను లీటరు నీటిలో కలుపుకుని వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి రైతులు తమ పంటలను కాపాడుకోవాలని ఆమె తెలిపారు.

## జీడీపీకి వరద నీరు వచ్చి చేరుతుంది

### -జీడీపీలో 2.010 టీఎంసీ నీరు



గాజులదిన్నె ప్రాజెక్టుకు చేరిన వరద నీరు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** జిల్లాలో రైతుల జీవనాడి అయిన గాజులదిన్నె ప్రాజెక్టు వదర నీటితో కళకళలాడుతుంది. గత పది రోజులుగా కురుస్తున్న అడపదడపా వర్షాల కారణంగా జీడపీకి రోజు వరద నీరు వచ్చి చేరుతుంది. సోమవారం సాయంత్రంకు జీడీపీలో 2.010 టీఎంసీ(లైవ్) నీరు ఉన్నట్లు జీడీపీ ఇరిగేషన్ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. సోమవారం ఒక్కటే ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 1000 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు ను చేరింది. హంద్రీనీవా నుంచి రోజుకు 120 క్యూసెక్కుల నీరు చేరుతుంది. అలాగే తుంగభద్ర దిగువ కాలువ నుంచి రోజకు 60 క్యూసెక్కు నీరు చేరుతుంది. గత మూడేళ్లుగా వరద నీరు వచ్చి చేరలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాలలో వర్షం కురియడం కారణంగా వరద నీరు వచ్చి చేరుతుంది. తెర్నేకల్లు వంక వృద్ధుతంగా ప్రవహిస్తుంది ఆ నీరు జీడీపీని వచ్చి చేరుతున్నాయి.

## రైతుసేవ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

- అధికారుల సూచన మేరకు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి



యూరియాను అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** యూరియా కొరత లేదని, అధికారుల సూచన మేరకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వరలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం పెద్దహరివాణం రైతు సేవా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంటలకు యూరియా ఎక్కువగా వినియోగించడం వలన తెగుళ్లు, పురుగులు వ్యాప్తి చెందుతాయని, దీంతో పంటలు నాశనమై దిగుబడి తగ్గుతుందన్నారు. అధిక వర్షాల వలన పంట పొలాల్లో నీటి నిల్వలు పెరిగాయని, ఆ నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సాగు చేసిన పత్తి పొలాలను సందర్శించి పత్తి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వారు రైతులకు యూరియాను పంపిణీ చేశారు. సహాయ వ్యవసాయ సంచాల కులు బాలవర్ధి రాజు, ఆదోని మండల వ్యవసా య అధికారి బివిజి సుధాకర్, వ్యవసాయ అ ధికారి సతీష్, గ్రామ వ్యవసాయ సహాయ కులు శ్రీనివాస్ నాయక్,సాంబశివుడు,న రైతులు పాల్గొన్నారు.

# వర్షాలతో పొంగి పొర్లుతున్న వాగులు

– నీట మునుగుతున్న పంట పొలాలు

– నష్టపోతున్న రైతులు



వరద నీటిలో మునిగిన వరి పంట



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కోవెలకుంట్ల మండలంలో కురుస్తున్న వర్షాలతో పలు వంకలు, వాగులు పొంగి పొర్లి ప్రవహిస్తుండటంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుందూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కుందూకు తోడు కుందరవాగు, పెద్దవంక, చిన్నవంతెవాగు, నల్లవాగులు తోడు కావడంతో కుందూ మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. కుందూ కింద సాగు చేసిన పంటలు వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, తదితర పంటలు పూర్తిగా మునిగిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వాగుల వెంట కూడా పొలాల్లోకి నీరు చేరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. అధిక వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు వాగులు, వంకలు మరింత నష్టాన్ని మిగిల్చాయని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కుందూవెంట లింగాల, వల్లంపాడు, పెద్దకొప్పెర్ల, చిన్న కొప్పెర్ల, గోవిందిన్నె, కలుగోట్ల, జ్వాలదరాశి, కంపమళ్ళ గ్రామాలలోని పంట పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాలలో నీటి మునిగిన పంటలను వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఈ వాన రైతులను మరింత నష్టాలకు గురి చేస్తోంది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

## వేరుశనగ పంట.. వర్షాల పాలు..

● రూ. లక్షన్నర పంట నష్టం.. బసలదొడ్డి రైతు ఆవేదన





**పెద్దకడబూరు మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పెద్దకడుబూరు మండలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్దకడుబూరు మండల పరిధిలోని బసలదోడ్డి గ్రామానికి చెందిన రైతు జి.నరసింహులు తనకున్న రెండున్నర ఎకరాల పోలంలో వేరుశనగ పంటను సాగు చేశా రు. అయితే ఆదివారం రాత్రి ఏకధాటిగా కురిస్తున్న భారీ వర్షం వల్ల వేరుశనగ పంట పూర్తిగా తడిసి పోవడంతో తీవ్ర నష్టా న్ని చవి చూశారు. ఆయన దాదాపు పంటకు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టిన పంటమొత్తం పనికిరాకుండా పోయిందని అయన ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అలాగే అనుకోని విపత్తుల వల్ల సుమారు గా ఒకటిన్నర లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని చెప్పారు కష్ట పడి వేసిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో కష్టపడి వేసిన పంట ఇలానే నాశనం కావడంతో రైతు కన్నీళ్లు పెట్టుకున్నారు. గ్రామస్థులుఆ రైతుకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# జలమయమైన పడకండ్ల రహదారి

అధిక వర్షాలతో నీట మునిగిన మొక్కజొన్న



రహదారిపై వర్షపు నీరు పారుతున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలో గత ఐదు రోజులు కురుస్తున్న వర్షాలతో రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఆళ్లగడ్డ నుండి అహోబిలం వెళ్లే రహదారిలో పడకండ్ల వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వర్షపు నీరు మోకాలి లోతు లో నీళ్లు పారుతున్నాయి. పల్లపు ప్రాంతాల నుండి వరద నీరు అధికంగా రావడంతో పంట కాలువల్లో నీరు అధికమై రోడ్డు మీదనే పొంగిపొర్లుతున్నాయి. దీంతో అహోబిలం రుద్రవరం చాగలమర్రి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు కాస్త ఇబ్బందిగా మారింది. వర్షం ఇలాగే కొనసాగితే వర్షపు నీరు మరింత వదురుతంగా పారి రహదారులను దిగ్బంధనం చేసే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. అలాగే వర్షాలు అధికంగా కురవడం వల్ల మొక్కజొన్న మినుము తదితర పంటలలో నీరు నిలబడి పైరు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.





మొక్కజొన్న పంటలో నీరు నిలబడిన దృశ్యం

# అన్నదాతకు కడుపుకోత

– ఎడతెరపిలేని వర్షాలు– పంటపొల్లాలో నీరు

– పంటలను పొలాల్లోనే వదిలేసిన అన్నదాతలు



వేరుశనగను, ఉల్లిని పీకేసి పొలంలో వదిలేసిన దృశ్యం

**కోసిగి మేజర్ న్యూస్:** వానదేవుడు ప్రతాపానికి అన్నదాతల కడుపుకోతను మిగిల్చింది. దాదాపుగా వారంరోజులకుపైగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలుపొర్లి పొంగి పంటపొలాలలోనే నీరు నిల్వ ఉండడం జరుగుంది. రాత్రనక, పగలనక వర్షం కురవడంతో పత్తి, మింప, ఉల్లి పంటలు నాశనం అవ్వడం జరుగుతుంది. అన్నదాతలు లక్షలాది రూపాయలు అప్పుచేసుకొని పంటలు పండిస్తే వానదేవుడి ఉగ్రరూపానికి అన్నదాత కడుపుకోతను మిగిల్చింది. వేసుకున్న పంటలు వర్షానికి తడిచి కుళ్ళి నాశనం అవుతుంటే రైతులకు కన్నీటిబాధతో బాధపడుతున్నారు. కొంతమంది రైతులు వర్షానికి ఉల్లిని భూమిలోనే కుళ్ళిపోయే ప్రమాదం ఉండడంతో పొలంలోనే ఉల్లిని పీకేసి వదిలివేశారు. అలాగే పత్తిపొలాల్లో వర్షపునీరు నిల్వఉండడంతో వేర్లుకుళ్ళిపోయి, పూతరాలిపోయి పత్తిపంట పూర్తిగా నాశనం అయిపోయిందని అన్నదాతలు వాపోతున్నారు. వారితో పాటు వేరుశనగ పంటను ముందుగా వేసుకున్న రైతులు పంట చేతికి రావడంతో అలాగే వదిలివేస్తే భూమిలోపల వేరుశనగ మొలకెత్తుతాయని భయంతో వేరుశనగను వర్షంలోనే పీకేసి వదిలివేస్తున్నారు. ఇలా అన్నదాతల కష్టాలు వర్ణాతీతంగా చెప్పవచ్చు. దాదాపుగా 15రోజుల నుండి వర్షాలు కురవడంతో ఈ సంవత్సరం పంటలు పూర్తిగా దెబ్బతిని భూమిలోనే కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నదాలు బోరున విలపిస్తున్నారు.

## మండలంలో ఉన్న వాగుల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలో ఉన్న వాగుల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ కళాశాల సమీపంలోని పాలేరు వాగును పరిశీలించారు. గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నల్లమల అడవి నుంచి వచ్చే ఈ పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రాత్రి ఏ సమయంలోనైనా పొంగిపొర్లే అవకాశం ఉంది. ఉధృతంగా ప్రవహించే పాలేరు వాగుపై రాకపోకలు నిల్చిపోతాయి. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వాగులు దాటడం, సాహసాలు చేయవద్దని ఆయన ప్రజలను హెచ్చరించారు.



పాలేరు వాగును పరిశీలిస్తున్న ఎస్సై రామ్మోహన్ రెడ్డి

## నీట మునిగిన పంటలు పరిశీలన



నీరు నిలిచిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బస్తిపాడు, చిన్నటేకూరు, బొల్లవరం గ్రామాల్లో కర్నూలు ఏడిఏ సాలు రెడ్డి, మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డిలు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నీటితో నిండిన పత్తి, ఉల్లి తదితర పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో నిలిచిన మురుగు నీటిని తొలగించడంతో పాటు పొటాషియం, నైట్రేట్ 5గ్రాములు లీటరు నీటికి లేదా 10గ్రాములు యూరియాను లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలన్నారు. లేదా 13-0-45ఒక కేజి ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో వేరు కుళ్లు, కాయ కుళ్లు తెలుగు ఎక్కువగా ఆశించిన పంటలకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు ఒక లీటరు నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవడం వల్ల వేరు కుళ్లు తెగులు నివారించవచ్చన్నారు. కాయకుళ్లు నివారణకు ఒక లీటరు నీటిని 100ఎంఎల్ స్టెప్లో సైక్లీన్+3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి రెండు లేదా మూడుసార్లు పిచికారి చేసుకోవడం వల్ల నివారించ వచ్చన్నారు. ఉల్లిలో అధిక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

# జలమయమైన లోతట్టు ప్రాంతాలు

– పొంగిపారుతున్న భవనాశి వాగు

– పలు గ్రామాలకు రాకపోకలు అంతరాయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆత్మకూరు మండల పరిధిలో ఎడతెరపిలేని వర్షం కారణంగా భవనాశి వాగుకు అధికంగా వరద నీరు చేరుకోవడంతో పొంగిపారుతుంది. దీంతో పలు గ్రామాలకు రాపోకలు నిలిచిపోయాయి. గత ఆదివారం నుంచి సోమవారం వరకు ఎడతెరపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. భవనాశి వాగు ఉధృతి పెరిగి ప్రయాణికులు దాటకుండా ఉప్పొంగుతుంది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై చెరువులను తలపిస్తు న్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనాశి వాగు వద్ద ప్రయాణికులు దాటకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పర్యావేక్షిస్తున్నారు. కురుస్తున్న వర్షాన్ని దృష్టిలోఉంచుకొని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణం ఉంటే వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అనవసరంగా వచ్చి రాకపోకలు జరగక ఇబ్బందులు పడవద్దని ప్రజలను పోలీసులు హెచ్చరిస్తు న్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళిన ప్రయాణికులు రాకపోకలు నిలియిపోవడంతో పట్టణంలోనే ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



# అవయదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి

## – కలెక్టర్ రాజకుమారి



అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరు అవయదానంపై అవగాహన కలిగి ఉండాలని అవయదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి జీవితంలో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పిజిఆరఎస్ హాలులో జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గత జూన్ మాసంలో మొట్టమొదట అవయదానం చేసిన మహిళ బొప్ప సుజాత కుటుంబ సభ్యులకు రూ.50వేల నగదు పారితోషికం, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల మండలం గుంతనాల గ్రామ నివాసి సుజాత గోస్పాడు మండలం తేళ్ళపురి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా గత జూన్ నెల 1వ తేదీన ఆమె రోడ్డు ప్రమాదానికి గురైంది. తనను బతికించడం కోసం డాక్టర్లు తీవ్రంగా కృషి చేశారు. అయినా ఆమె బ్రెయిన్‌డెత్ కావడంతో వారి సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబ సభ్యులను అవయవదానం కోసం ఒప్పించి రెడ్‌క్రాస్‌ను సంప్రదించారు. ఈమేరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన అవయదానం చేయించి 7మంది జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆ కుటుంబానికి నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈసందర్భంగా బొప్పా సుజాత సోదరి డాక్టర్ విజయ మాట్లాడుతూ అవయదానంపై చాలా మందికి అపోహలు ఉన్నాయని మన కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల తమ మనుషులు బతికి ఉన్నారన్న సంతృప్తి కలుగుతుందన్నారు. తన సోదరి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నా ఏవిధంగా ముందుకు వెళ్లాలో తోచలేదని ఆ సమయంలో రెడ్‌క్రాస్‌ను సంప్రదించామని తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖలు తమకు సహకరించాయని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్న అధికారులకు ఘన సన్మానం


అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ఆగస్టు 15న 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించు కొని నంద్యాలలో జరిగిన స్వాతంత్ర వేడుకల్లో వారు అందించిన ఉత్తమ సేవలకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ఉత్తమ సేవా ప్రశంసపత్రాలు అందుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఏఎస్‌వో హనుమంతులను పారుమంచాల టీడీపీ నాయకులు దేవసహాయం, లక్ష్మన్న గౌడ్‌లు వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మంచి సేవలు అందించిన ప్రభుత్వ అధికారులకు ఇలాంటి అవా ర్డులు ఇంకా ప్రోత్సహించేలా ఉపయో గపడతాయని అన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, నాగన్నలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌లో..

# ప్రైవేట్ వ్యక్తులకు పరీక్షలు

- ఫిలిం కావాలంటే ఒక్కో ఫిలింకు రూ.1500లు వసూలు
- సిఫారసులతో ప్రైవేటు వ్యక్తులకు ఎంఆర్ఐ చేస్తున్న సెంటర్
- సిఫారసు లేకుండా డైరెక్టుగా ఎంఆర్ఐకు వచ్చిన వారికి బయట బిల్లులో సగం డబ్బులు వసూలు
- ఫోన్ పే లేదంటున్న ఎంఆర్ఐ సిబ్బంది
- ఫోన్‌పే లేకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్న స్కానింగ్‌కు వచ్చిన ప్రజలు
- ఎంఆర్ఐ గోల్‌మాల్ ఉందేమో అనుకుంటున్న ప్రజలు
- అడ్మిషన్ లేకపోతే స్కానింగ్ చేయకూడదని సూపరింటెండెంట్ ఆదేశాలు
- ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి..?




**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల వైద్య చికిత్సలో భాగంగా ఉచిత పరీక్షలు, ఉచిత స్కానింగ్ ఎంఆర్ఐ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజా సేవ నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రతి ఓపి వైద్య సేవ విభాగంలోనూ పేషెంట్లు సమస్య తీవ్రతను వివరించి ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లు చేయమన్నా వైద్యులు చేయడం లేదు. సూపరింటెండెంట్ అడ్మిట్ అయిన వారికి మాత్రమే రోగి యొక్క సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్‌లు చేయించాలని ఆదేశించినట్లు ఓపి వైద్యులు తెలిపారు. ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ప్రైవేటు కంపెనీ కాంట్రాక్టు తీసుకుని ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న పేషెంట్లకు మాత్రమే ఉచితంగా ఎంఆర్ఐ తీస్తున్నారు. ఎంఆర్ఐ తీసిన రిపోర్టు ఉచితంగా అందిస్తున్నారు. సంబంధిత ఫిలిం కావాలంటే ఒక ఫిలిం కాస్ట్ రూ.300లు చొప్పున చెల్లించి ఫిలం తీసుకోవాలి. అయితే ఈ ఎంఆర్ఐ సెంటర్ నందు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం తీసుకోని వ్యక్తులకు రెకమెండేషన్ (సిఫారసు) ద్వారా ఈ స్కాన్ ప్రైవేటుగా తీస్తే ఎంత మొత్తం వసూలు చేస్తారో అందులో సగం ఈ స్కానింగ్ సెంటర్ నందు సగం డబ్బులు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బుధవారం ఫిలిం కావాలని ఎంఆర్ఐ సిబ్బందిని అడిగినా ఒక వ్యక్తిని బిల్లు చెల్లించాలని చెప్పగా ఫోన్ పే ద్వారా చెల్లిస్తాను అనగా ఫోన్‌పేలు ఇక్కడ పనిచేయవని ఎంఆర్ఐ సిబ్బంది ఘాటుగా సమాధానం ఇవ్వడంతో వాగ్వివాదం జరిగిందని స్కానింగ్‌కు వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనప్పటికీ నిబంధనల ప్రకారం నీతి నిజాయితీతో కట్టుబడి తమకు ఇచ్చిన బాధ్యతలను ఒక్కరు కూడా నిర్వహించకపోవడం బాధాకరమని ప్రజలు గుసగుసలాడుతున్నారు. స్థాయిని బట్టి అక్రమ సంపాదన కోసం వ్యక్తిత్వాలను తాకట్టు పెడుతున్నట్లు ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇష్టానుసారంగా ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను నిర్వహిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న కంపెనీ కాంట్రాక్టును రద్దు చేసి నిక్కచ్చిగా నియమ, నిబంధనలతో నడిపే వ్యక్తులకు ఎంఆర్ఐ స్కానింగ్ పెట్టుకునే అవకాశం కల్పించాలని సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు కోరుతున్నారు.

# స్కూల్స్, కాలేజీలలో ప్రవేశం నిషేధించడం తగదు



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం విద్యార్థి సంఘాల హక్కులను హరించేలా స్కూల్స్, హాస్టల్స్, కాలేజీలలో ప్రవేశం నిషేధించడం తగదని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయి కుమార్ అన్నారు. సోమవారం వైసిపి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వైసిపి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పాతబస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ముందు విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిసి విభాగం సిటీ ప్రెసిడెంట్ బబ్లు, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి మధుమోహన్‌లతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కటారుకొండ సాయి కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థపైన కూటమి ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య వైఖరి బయట పడుతుందనే ఈ చీకటి జీవోను ప్రభుత్వం విడుదల చేసిందని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుందని మండిపడ్డారు. ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చిన్న రాజు, కడుమూరు షఫీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఎల్‌కెఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 17 ఆగస్టు 2025 ఆదివారం రోజున శ్రీ కోదండపాణి సంగీత విద్యా సంస్థ మరియు సాలార్జింగ్ మ్యూజియం హైదరాబాద్ వారిచే నిర్వహించబడిన పాటల పోటీలలో ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంతో అద్భుతంగా పాడి రెండవ స్థానాన్ని గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల నుండి ఎంతోమంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్కెఆర్ గ్లోబల్ స్కూల్ పిల్లల యొక్క ఆశక్తిని తెలుసుకొని వారిని అన్ని రకాలైనటువంటి రంగాలలో రాణించడానికి ఎంతో కృషి చేస్తుందని తెలియజేశారు. అలాగే చదరంగం, ఆటలలో, పాటలలో, చదువులో నృత్యాలలో, టైక్వాండో మరియు అనేక రకమైనటువంటి రంగాలలో పిల్లలను తీర్చిదిద్దడంలో ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ ముందుంటుందని తెలియజేశారు. అలాగే అన్ని విధాలుగా సహకరిస్తున్నటువంటి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్స్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# హాస్టల్‌ను పరిశీలించిన డివిఎంసి మెంబర్స్


విద్యార్థులను పరామర్శిస్తున్న విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాలతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గొంది ఎల్లె మాలతి, ఉల్చలా మద్దిలేటిలు సోమవారం పరిశీలిం చారు. హాస్టల్లో ఆదివారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయి 10మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో హాస్టల్‌ను వారు సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ అయిన సంఘటనలో వార్డెన్ సుంకన్న నిర్లక్ష్యమే కారణమని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు. వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేవని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి సంఘం నాయకులు యోగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

## – హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదు


హెల్మెట్ తెచ్చుకున్న వారికి పువ్వు ఇచ్చి సాగనంపుతున్న దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదని ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ తెలిపారు. సోమవారం నగరంలోని సి క్యాంపు, బళ్లారి చౌరస్తా, రాజ్ విహార్‌తో పాటు పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని 100మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.1000లు జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని ద్విచక్ర వాహనాన్ని హెల్మెట్ లేకుండా నడిపే వారిని ఆపి వారికి అరగంట టైం ఇచ్చి హెల్మెట్ తెచ్చుకోవాలని చెప్పామని హెల్మెట్ తెచ్చుకున్న వారికి జరిమానా లేకుండా రోజాపువ్వు ఇచ్చి పంపినట్లు తెలిపారు. హెల్మెట్ తెచ్చుకోని 100మందికి ఒక్కొక్కరికి రూ.1000లు జరిమానా విధించినట్లు తెలిపారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మంగళవారం | 19 ఆగస్టు 2025

## కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి బి.సి


రిజిస్ట్రర్‌ను తనిఖీచేస్తున్న మంత్రి బిసి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సోమవారంనాడు అకస్మిక తనికీ నిర్వహించారు. విద్యార్ధినీల కు పాఠశాలలో చదివిస్తున్న భోజన, ఆహార వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ బ్యాగులు, డ్రస్సుల నాణ్యత గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. తల్లికి వందనం పథకం అందరికీ వర్తించిందా అని విద్యార్థినీలను ప్రశ్నించగా విద్యార్థినీలు ముక్తకంఠంతో వచ్చిందని సమాధానం ఇచ్చారు. అలాగే మెనూ ప్రకారం భోజనం అందుతుందా సన్నబియ్యం వండుతున్నారా అన్న విషయాలను విద్యార్థులనుంచే రాబట్టారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించడం జరిగింది. పాఠశాల స్టోర్‌ముల్‌లో ఆహార సామాగ్రి, నాణ్యతను కిచెన్‌రూమును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బి.సి మాట్లాడుతూ బనగానపల్లెలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల కోసం 2.5కోట్ల నిధులతో అదనంగా మరో 6 నూతన రూములు నిర్మించి జూనియర్ కాలేజ్‌గా విస్తరించనున్నట్లు తెలిపారు. నూతన భవనాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి పలు సూచనలను చేశారు. పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని విద్యార్థినీలు బాగా చదువుకొని మంచి పేరు తీసుకొని రావాలన్నారు. అలాగే విద్యార్థినీలు ధోభీఘాట్ కావాలని కోరగా వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇంకా ఏమైనా పాఠశాలకు సంబంధించి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తామని తెలిపారు.


విద్యార్థినులను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి బి.సి

## ఎంపీడీవో కార్యాలయం వద్ద దివ్యాంగులు ధర్నా..

**దివ్యాంగుల పెన్షన్ తొలగింపు పై మద్ధతునిచ్చిన సిపిఎం..**



**తుగ్గలి , మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము వికలాంగుల పెన్షన్ను పర్సంటేజ్ తక్కువగా ఉందని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి నోటీసులు ఇవ్వడం సరికాదని వెన్నెల మండల వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి మండల పరిషత్ కార్యాలయం ఎదుటధర్నా నిర్వహించారు. వికలాంగుల ధర్నా కార్యక్రమానికి సిపిఎం పూర్తిగా మద్దతు పలికింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము వికలాంగుల పెన్షన్లను వెరిఫికేషన్ పేరుతో అన్యాయంగా తొలగించడం మరి దారుణం అన్నారు. గతంలో డాక్టర్ల వీరు వికలాంగులే కదా అని సర్టిఫికెట్ ఇస్తే ఈ ప్రభుత్వం వికలాంగులను చూడకుండా పింఛన్లను దారుణంగా తొలగించడం సరికాదన్నారు. వికలాంగత్వం ఉండడం వల్లే పెన్షన్లతో ఆధారపడిన వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా తొలగించడం మరి దారుణమన్నారు. వికలాంగుల పెన్షన్లు తొలగిస్తే ఆందోళనలు ధర్నాలు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు రామాంజనేయులు,వీరేష్ నాగరాజు వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులు పాల్గొన్నారు. అనంతరము డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరికి వినత పత్రం అందజేశారు.

## అన్న దాతలకు అండగా కూటమి ప్రభుత్వం..ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**గడివేముల,మేజర్ న్యూస్ :**అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. సోమవారంగడివేముల మండల కేంద్రంలోని సహకార వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా దాదాపు 32 లక్షలతో నిర్మించిన నూతన సొసైటీ బ్యాంకు, గోదాంను ప్రారంభించారు. అనంతరం సొసైటీ చైర్మన్ గా దేశం సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లుగా శివారెడ్డి, యుగంధర్ రెడ్డిలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా సహకార అధికారి నంద్యాల ఎన్ రామాంజనేయులు, నంద్యాల చీఫ్ బ్రాంచ్ మేనేజర్ హుస్సేన్ భాష సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పూలమాలతో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 90% హామీలను నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వంలో అలగనూరు రిజర్వాయర్ కట్ట మరమ్మత్తులకు గురి అయితే మూడు కోట్ల రూపాయలతో అయిపోయే పనులకు కమిషన్లకు కక్కుతి పడి గాలికి వదిలేసారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రితో మాట్లాడి 37 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు, అలాగే కొర్ర పోలూరు రోడ్డు రెండు కోట్లతో పూర్తి చేసామని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో రైతులు రుణాలు తీసుకోవచ్చు మరియు చెల్లించవచ్చున్నారు. రైతుకు 20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తాం అన్నారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతుందన్నారు. సహకార బ్యాంకు ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, ఈఓఆర్డి మహిదర్ రెడ్డి టిడిపి నాయకులు దేశం నరేంద్ర రెడ్డి, మూల పెద్దమ్మ చైర్మన్ రమణారెడ్డి, గడివేముల సర్పంచ్ రమణమ్మ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పర్వతమ్మ, సీఈవో ఆదినారాయణ, తోటి సీఈవోలు, కేబి మల్లికార్జున, భోదనం భాస్కర్ యాదవ్, మాజీ సర్పంచ్ జమాల్ బాషా, ఎస్ఎండి రఫిక్, ఫారుక్,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

## శ్రీశైలం ఘాట్ లో కరెంటు పోల్ ను ఢీ కొట్టిన వాహనం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం, శిఖరేశ్వరం సమీపంలో ఓ తుఫాను వాహనం కరెంటు పోల్ను ఢీ కొట్టింది. కొందరు యాత్రికులు మల్లన్న దర్శనార్థమై సోమవారం తుఫాను వాహనంలో శ్రీశైలం వస్తుండగా శిఖరేశ్వరం,నంది టర్నింగ్ వద్ద ప్రమాదవశాత్తు కరెంటు పోల్ ను ఢీ కొనటంతో విద్యుత్తు తీగలు వాహనంపై పడ్డాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



## టీడీపీతోనే మహిళా సంక్షేమం సాధ్యం



**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** టీడీపీ పాలనలోనే మహిళా సంక్షేమం సాధ్యం అవుతుందని టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, సింగిల్విండో అధ్యక్షుడు రామాంజినేయులు, బేతాలబడేసా అన్నారు. సోమవారం పార్టీ కార్యాయలంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా స్త్రీశక్తి పథకం ద్వార మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడి కైన ఉచిత ప్రయాణం చేసే అనుకూలత కలగడంతో మహిళలు అనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజిలు, మెగా డీఎస్సీ, దీపం పథకం ద్వార ఉచితంగా మూడు సిలిండర్లు, తల్లికివందనం కింద ప్రతి విద్యార్థికిరూ 13వేలు నగదు అన్నదాన సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక చేయూత కూటమి ప్రభుత్వం అందిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ షేక్షావలి, రంగస్వామినాయుడు, అక్బరాబాషా, శ్రీధర్, రమేషానాయుడు, మాజీ సర్పంచ్ రంగముని, రాంపురం రఫీక్, మేకల మునెప్ప, కడపల వెంకటేష్, ఆరేళ్ల రంగస్వామి టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠ

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః**

కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీ.శే పి.పి వేణుమాధవ్ స్కూల్ అసిస్టెంట్ లెక్కల మాస్టార్ జ్ఞాపకార్థం వారి భార్య అరుణ కుమారి మరియు వారి పిల్లలు ఆర్థిక సహాయంతో పాఠశాల ప్రాంగణంలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్టను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వర రెడ్డి మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ కలాం మరియు రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి రాజయ్య మరియు పాఠశాల ఉపాధ్యాయులు పనిచేసి వెళ్లిన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయునీలు మరియు పాఠశాల విద్యార్థులు గ్రామ పెద్దలు లక్ష్మి నారాయణమ్మ, నారాయణ రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

# రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం..!

**-సూపర్ సిక్స్ పథకాల పై వాదోపువాదాలు**
**-వైసిపి కౌన్సిలర్ చేతిలో మైకున్ ను లాకున్న టిడిపి కౌన్సిలర్**
**-సభా మర్యాదలు పాటించాలని ఆగ్రహంతో హుకుం జారీ చేసిన ఛైర్మెన్**
**-సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతోషం**
**- కౌన్సిలర్లు స్వాతి, రాందాస్**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాల పై సోమవారం ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో తోపులాటకు దారితీసింది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కె ఎస్ రఘు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 23 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. అలాగే ఎమ్మిగనూరు ప్రభుత్వ కార్యాలయాల స్థలదాత హసన్ బేగ్ విగ్రహాన్ని గోనెగండ్ల సర్కిల్లో ఏర్పాటు చేయాలని, అలాగే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని స్థానిక రిక్రియేషన్ క్లబ్ సమీపంలో ఏర్పాటు చేసేందుకు గతంలోనే కౌన్సిల్ ఆమోదం పొందిందని వీటిని తక్షణమే ఏర్పాటు చేయాలనిఆయనకోరారు. మూడో వార్డు కౌన్సిలర్ స్వాతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, స్థానిక ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సమయంలో ఆరో వార్డు కౌన్సిలర్ శివప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని వీటి అమలులో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారంటూ తాము ఇటీవల నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రతి వార్డులో ప్రజల నుంచి స్పందన తీసుకున్నామన్నారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్లు ఇసాక్, అమానుల్లా, బీజేపీ కౌన్సిలర్ దయాసాగర్‌లు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, శ్రీ శక్తి పథకాలను అమలు చేసి చేసిన ఘనత తమకే దక్కుతుందని కేవలం ప్రజలను కూటమి ప్రభుత్వం పై ప్రక్కదారి పట్టించేందుకు మాట్లాడడం సరికాదని ధ్వజమెత్తారు. ఒకరికొకరు తీవ్రస్థాయిలో వాగ్వాదం చేసుకుంటూ చైర్మన్ పోడియం ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ ఇషాక్ వైసీపీ కౌన్సిలర్ శివప్రసాద్ ను త్రోసివేస్తూ చేతిలోని మైకును లాక్కున్నారు. దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది అందుకు చైర్మన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ మర్యాదలను పాటించాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఏ ఒక్కరు చేయకూడదని హుకుం జారీ చేశారు. కొంతసేపు సమావేశం నిశ్శబ్దాన్ని చోటుచేసుకుంది వాటి తర్వాత కౌన్సిలర్ బజారి, డిష్ కేశవరెడ్డి, రెండవ వైస్ చైర్మన్ దివ్య కళలు మాట్లాడుతూ అధికారులు పనులు చేస్తున్నారు కానీ గత కౌన్సిల్లో తాను అడిగిన పనులకు ఇప్పటివరకు ఎలాంటి రూపకల్పన జరగలేదని అన్నారు. అలాగే 3వ వార్డు కౌన్సిలర్ స్వాతి మాట్లాడుతూ తమ ప్రాంతంలో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అధికారులు పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ సభ్యులు అడిగిన ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కూడలిల్లో విగ్రహాల ఏర్పాటు విషయం లో కౌన్సిల్ సభ్యులందరూ కూర్చొని ఓ తీర్మానానికి వస్తే శాసనసభ్యుల సహకారంతో వాటన్నిటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పనులు చేసినకాంట్రాక్టర్ల బిల్లులచెల్లింపు విషయంలో15 రోజుల్లో స్పష్టత వస్తుందని ఇప్పటివరకు రూ. ఆరు కోట్ల మేర బిల్లులు పెండింగ్లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలో చెల్లింపుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టిపిఓ రాజేష్, డిఈ నీరజ, ఏఈలు మదన్, శరత్ చంద్ర, ఆర్వో అస్లాం భాష పాల్గొన్నారు.


వాదోపువాదాలు చేసుకుంటున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు


వైసీపీ కౌన్సిలర్ నుంచి మైక్ ను లేకుంటున్న టీడీపీ కౌన్సిలర్ ఇషాక్


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ స్వాతి

# Previovs Paper APPSC Group-2 Mains
# జనరల్ స్టడీస్ పేపర్-2

(గత సంచిక తరువాయి)

**87. జన్యుపరంగా మార్పు చెందిన (జీఎమ్) పంటలకు సంబంధించిన ప్రాథమిక పర్యావరణ ఆందోళన ఏమిటి?**

1. జీఎమ్ కాని పంటలతో పర-పరాగసంపర్కం
2. పురుగుమందుల వాడకం తగ్గడం
3. దిగుబడి పెరగడం
4. నేల క్షీణత

**88. భారతదేశంలో జన్యుపరంగా మార్పు చెందిన జీవులను (జీఎమ్ఓలు) ఏ సంస్థ నియంత్రిస్తుంది?**

1. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌యస్‌యస్‌ఏఐ)
2. జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ (జిఇఎసి)
3. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి)
4. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్)

**89. క్రింది వాటిలో వ్యవసాయంలో ఉపయోగించే పర్యావరణ అనుకూల సాంకేతికతకు ఏది ఉదాహరణ?**

1. జన్యుపరంగా మార్పు చెందిన పంటలు
2. సేంద్రీయ వ్యవసాయం
3. పురుగుమందుల పిచికారీ
4. రసాయన ఎరువులు

**90. పర్యావరణంపై సాంప్రదాయ వ్యవసాయం యొక్క ప్రభావాన్ని (ముఖ్యంగా నీటికొరత ఉన్న ప్రాంతాల్లో) తగ్గించగల సాంకేతికత ఏది?**

1. బిందు సేద్యం
2. రసాయన పురుగుమందులు
3. వరద నీటి పారుదల
4. ఏటా ఒకే పంటను ఒకే భూమిలో పండించుట (మోనోక్రాపింగ్)

**91. బయోరెమిడియేషన్ యొక్క ప్రాథమిక వినియోగం దేనికి?**

1. వాయు కాలుష్యం
2. నేల కాలుష్యం
3. శబ్ద కాలుష్యం
4. నీటిద్వారా వచ్చే వ్యాధులు

**92. చమురు చిందటాలను శుద్ధి చేయడానికి క్రింది వాటిలో ఏ బయో రెమిడియేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు?**

1. ఫైటో రెమిడియేషన్
2. బయో అగ్మెంటేషన్
3. బయో వెంటింగ్
4. మైకో రెమిడియేషన్

**93. వ్యర్థ రకాన్ని దాని సరైన తొలగించే పద్ధతితో సరిపోల్చండి.**

| వ్యర్థ రకం | తొలగించే (డిస్పోజల్) పద్ధతి |
|---|---|
| ఎ. సేంద్రీయ వ్యర్థాలు | 1. దహనం |
| బి. ఈ-వేస్ట్ | 2. పదార్థములను కప్పి ఎరువు తయారు చేయుట (కంపోస్టింగ్) |
| సి. ప్రమాదకర వ్యర్థాలు | 3. వ్యర్థాలను గుంటలలో పూడ్చటం (ల్యాండ్ ఫిల్లింగ్) |
| డి. పగిలిన గాజు ముక్కలు | 4. పునర్ వినియోగం (రీసైక్లింగ్) |

కోడ్‌లు :

1. ఎ-2, బి-4, సి-1, డి-3
2. ఎ-4, బి-2, సి-3, డి-1
3. ఎ-2, బి-4, సి-3, డి-1
4. ఎ-4, బి-2, సి-1, డి-3

**94. వ్యర్థాలను పారవేసే పద్ధతిని దాని లాభాలు లేదా నష్టాలతో సరిపోల్చండి?**

| పారవేయు (డిస్పోజల్) పద్ధతి | లాభాలు/నష్టాలు |
|---|---|
| ఎ. ల్యాండ్ ఫిల్లింగ్ | 1. తక్కువధర, కానీ దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. |
| బి. దహనం | 2. వ్యర్థాల పరిమాణాన్ని తగ్గిస్తుంది, కానీ కాలుష్య కారకాలను విడుదల చేస్తుంది. |
| సి. కంపోస్టింగ్ | 3. బయోగ్యాస్ వంటి ఉపయోగకరమైన ఉప ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తుంది, కానీ భూమి అవసరం. |
| డి. రీసైక్లింగ్ | 4. వనరులను సంరక్షిస్తుంది, కానీ మౌలిక సదుపాయాలు అవసరం. |

1. ఎ-2, బి-4, సి-1, డి-3
2. ఎ-4, బి-2, సి-3, డి-1
3. ఎ-1, బి-2, సి-3, డి-4
4. ఎ-4, బి-2, సి-1, డి-3

**95. ఘన వ్యర్థ నిర్వహణలో (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) సున్నా వ్యర్థాల విధానాన్ని (జీరో వేస్ట్ కాన్సెప్ట్) అనుసరించినందుకు గాను ఏ భారతీయ నగరం గుర్తింపు పొందింది?**

1. ముంబై
2. ఢిల్లీ
3. పూణె
4. ఇండోర్

**96. క్రింది వాటిలో ప్రపంచ వాతావరణ మార్పు (గ్లోబల్ క్లైమేట్ చేంజ్) యొక్క టిప్పింగ్ పాయింట్ ఏది?**

1. ఆర్కిటిక్ మంచు నష్టం
2. కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపు
3. పెరిగిన అటవీ నిర్మూలన
4. సౌర వికిరణంలో తగ్గుదల.

**97. ఓజోన్ రంధ్రం ప్రధానంగా దీని విడుదల వలన ఏర్పడుతుంది?**

1. కార్బన్ డయాక్సైడ్
2. క్లోరోఫ్లోరో కార్బన్‌లు (సిఎఫ్‌సిలు)
3. నైట్రస్ ఆక్సైడ్
4. మీథేన్

**98. ఏ అంతర్జాతీయ ఒప్పందం వాతావరణ మార్పులను ఎదుర్కొవటానికి గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించటంపై దృష్టి సారించదు?**

1. మాంట్రియల్ ప్రోటోకాల్
2. క్యోటో ప్రోటోకాల్
3. పారిస్ ఒప్పందం
4. బాసెల్ కన్వెన్షన్

**99. వాతావరణ మార్పులపై భారతదేశం యొక్క జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఎపిసిసి) వీటిని పరిష్కరించటం లక్ష్యంగా పెట్టుకుంది?**

1. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు మాత్రమే
2. వాతావరణ మార్పుల కోసం ఉపశమన మరియు అనుసరణ వ్యూహాలు
3. జీవవైవిధ్య పరిరక్షణ
4. వాయు కాలుష్య నియంత్రణ

**100. బ్లాక్ కార్బన్ యొక్క ఏ ముఖ్య లక్షణం గ్లోబల్ వార్మింగ్‌ను వేగవంతం చేస్తుంది?**

1. ఇది ఒక రకమైన మీథేన్
2. ఇది అసంపూర్ణ దహనం ద్వారా ఉత్పత్తి చేయబడిన స్వల్పకాలిక కాలుష్యం
3. ఇది సిఎఫ్‌సిల ద్వారావిడుదల చేయబడుతుంది.
4. ఇది నేరుగా ఓజోన్ పొరను క్షీణింపజేస్తుంది.

**101. పారిస్ ఒప్పందం ద్వారా నిర్దేశించబడిన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలకు క్రింది దేశాల్లో ఏది(వి) చట్టబద్ధంగా కట్టుబడి ఉంది (ఉన్నాయి)?**

1. యునైటెడ్ స్టేట్స్ మరియు చైనా



2. భారతదేశం
3. యూరోపియన్ యూనియన్
4. వీటిలో ఏవీ లేవు.

**102. వాతావరణ మార్పులపై భారతదేశ జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఎపిసిసి) లో ఎన్ని ప్రధాన నియోగములు (మిషన్లు) చేర్చబడ్డాయి?**

1. 5
2. 8
3. 12
4. 10

**103. ప్రజారోగ్యంలో భారతదేశం ఎదుర్కొంటున్న ద్వంద్వ భారం ఏమిటి?**

1. అంటు మరియు సంక్రమించని (నాన్-కమ్యూనికేబుల్) వ్యాధుల పెరుగుదల రేట్లు.
2. అధిక భారం ఉన్న వైద్యులు మరియు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు.
3. బీమా మరియు ఆర్థిక అందుబాటు (యాక్సెస్) లేకపోవడం.
4. ఊబకాయం మరియు పోషకాహార లోపం రెండిటి యొక్క అధిక రేట్లు.

**104. సుస్థిర అభివృద్ధి భావన మొదట ఏ నివేదిక ద్వారా ప్రాచుర్యం పొందింది?**

1. యుఎన్‌డిపి నివేదిక 1992
2. ప్రపంచ బ్యాంకు నివేదిక 1985
3. బ్రంట్ ల్యాండ్ కమిషన్ నివేదిక 1987
4. రియో డిక్లరేషన్ 1992

**105. సుస్థిర అభివృద్ధి యొక్క కీలక లక్ష్యం ఏమిటి?**

1. పర్యావరణ ప్రభావాల పట్ల ఎలాంటి పట్టింపులేని ఆర్థిక వృద్ధి
2. సామాజిక సమానత్వం, ఆర్థిక వృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణకు భరోసా
3. ప్రపంచ జనాభా పెరుగుదలను పరిమితం చేయడం.
4. అన్నిటికంటే పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం.

**106. క్రింది వాటిలో ఏది సుస్థిరత యొక్క మూడు స్తంభాలలో ఒకటి కాదు?**

1. పర్యావరణ సుస్థిరత
2. ఆర్థిక సుస్థిరత
3. సామాజిక సుస్థిరత
4. రాజకీయ సుస్థిరత

**107. ఐక్యరాజ్యసమితి ఎన్ని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (యస్‌డిజిలు) ఏర్పాటు చేసింది?**

1. 17
2. 10
3. 12
4. 20

**108. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌తో సంబంధం లేని విషయం**

1. ఆరోగ్యమిత్ర
2. ఆరోగ్య ఐడి
3. సాండ్ బాక్స్
4. ఆరోగ్య సంరక్షణ నిపుణుల రిజిస్ట్రీ

**109. వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు (సర్క్యులర్ ఎకానమీ) సంబంధించి క్రింది వాటిలో ఏది నిజం?**

1. ఇది శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడం పై దృష్టి పెడుతుంది.
2. ఇది వ్యర్థాలను తగ్గించడానికి పదార్థాల పునర్ వాడకం, పునర్వినియోగం (రీసైక్లింగ్) మరియు మరమ్మత్తులను పోత్సహిస్తుంది.
3. ఇది సరళ రేఖామార్గ (లీనియర్) ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుంది.
4. ఇది కార్బన్ ఉద్గారాలను తగ్గించడంపైనే ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

**110. ఏ ప్రపంచ శిఖరాగ్ర సమావేశం (గ్లోబల్ సమ్మిట్) అజెండా (కార్యక్రమ పట్టిక) 21 మరియు రియో డిక్లరేషన్ (రియో ప్రకటన) ఆమోదించడానికి దారి తీసింది?**

1. క్యోటో ప్రోటోకాల్
2. ఎర్త్ సమ్మిట్ 1992
3. యుఎన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ 2015
4. వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2000

**111. భారతదేశంలో క్రింది వాటిలో ఏ ప్రజారోగ్య ప్రచారాన్ని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి ప్రారంభించారు?**

1. స్వచ్ఛ భారత్ అబియాన్
2. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన
3. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం
4. మిషన్ ఇంద్రధనుస్

**112. ఆయుష్మాన్ భారత్ ప్రాథమికంగా ఏ వర్గానికి ఆరోగ్య సంరక్షణను అందించటం లక్ష్యంగా పెట్టుకుంది?**

1. పట్టణ మధ్య తరగతి కుటుంబాలు
2. గ్రామీణ మరియు పేద జనాభా
3. వయో వృద్ధులు (సీనియర్ సిటిజన్లు)
4. ప్రభుత్వంతో సంబంధం లేని ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు (ప్రైవేట్ హెల్త్‌కేర్ ప్రొవైడర్లు)

**జవాబులు :**

**87)1, 88)2, 89)2, 90)1, 91)2, 92)2, 93)1, 94)3, 95)4, 96)1, 97)2, 98)4, 99)2, 100)2, 101)4, 102)2, 103)4, 104)3, 105)2, 106)4, 107)1, 108)1, 109)2, 110)2, 111)1, 112)2**

సూర్య

మంగళవారం | 19 ఆగస్టు 2025

# జగన్నాథగట్టు జర్నలిస్టుల స్థలాల అభివృద్ధికి కృషి చేయండి

- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా ను కోరిన ఏపీయూడబ్ల్యూజే నేతలు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన కలెక్టర్




**కర్నూలు, మేజర్ న్యూస్ :** జగన్నాథగట్టు జర్నలిస్టుల స్థలాల అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్ వెంకట సుబ్బయ్య, జిల్లా గౌరవ సలహాదారులు వైవీ క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి శివరాజ్ కుమార్ జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా ను కోరారు. సోమవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2009 లో జగన్నాథ గట్టుపైన జర్నలిస్టులకు ఎకరా రూ.4 లక్షల చొప్పున 61 లక్షల 26 వేల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి 15.44 ఎకరాల భూమిని కర్నూలు జిల్లా జర్నలిస్ట్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ తీసుకుందన్నారు. దీంతో సొసైటీ నిర్వాహకులు 258 మంది జర్నలిస్టులకు 3.50 సెంట్ల ప్రకారం ప్లాట్లు ఇచ్చారన్నారు. అయితే జర్నలిస్టుల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఏర్పాటు చేసుకోవడానికి అప్రోచ్ రోడ్, లింక్ రోడ్లు, కాలువలు, మంచినీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. దీంతో ఇన్నేళ్లు గడిచినా ఇళ్ళు నిర్మించలేని పరిస్థితి ఉందన్నారు. ఇళ్ళు నిర్మించలేదని గతంలోనున్న కలెక్టర్ జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలను రద్దు చేస్తూ ఆదేశాలు ఇవ్వడం, కలెక్టర్ ఆదేశాలపై హైకోర్టుకు వెళ్లడం, కోర్టు కలెక్టర్ ఆదేశాలను కొట్టి వేసిన విషయాన్ని తెలియజేశారు. అయినా ఆన్లైన్ లో జర్నలిస్టుల ఇంటి స్థలాలను మార్చి ప్రభుత్వ భూమిగా చేర్చారన్నారు. ఈ సమస్యను పరిష్కరించి జగన్నాథగట్టు జర్నలిస్టు స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకోవడానికి కావలసిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే చాలా మంది కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేవని, అందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అన్ని పరిశీలించి తప్పకుండా జర్నలిస్టులకు న్యాయం చేస్తామని చెప్పారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు సుధాకర్, రఫీ, అంజి పాల్గొన్నారు.

# అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వరా వచ్చే అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రాము నాయక్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్‌కు వస్తుంటారని అధికారులు వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో పలు సమస్యలపై బాధితులు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

# జిల్లాలో 23 బార్లు

- దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్
- 18 నుండి 26వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీని అమలులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో కర్నూలు జిల్లాకు 23 బార్లకు లైసెన్స్‌లు ఇవ్వనున్నారు. వీటికి సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం నుండే దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి సుధీర్‌బాబు తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉందని, 28వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లాటరీ ద్వారా దరఖాస్తులను ఎంపిక చేసి బార్లకు లైసెన్స్‌లు ఇస్తామని ఆయన చెప్పారు. 2022-25 వేలం వ్యవస్థలో సమూల మార్పులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025-28 కొత్త పాలసీని తీసుకువచ్చిందని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బార్ల కేటాయింపు, నిర్వహణలో పారదర్శకత, న్యాయబద్ధత, వ్యాపార ఆర్థిక స్థిరత్వంలో మేళవించిన కొత్త బార్ పాలసీ ఇదని ఆయన చెప్పారు. దరఖాస్తుల రుసుముగా 5 లక్షల రూపాయల ఫీజు, 10వేల రూపాయల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వేలానికి బదులు పారదర్శక లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తామని, పోటీతత్వాన్ని నిర్దేశించడానికి ఒక్కో బార్‌కు కనీసం 4 ధరఖాస్తులు అవసరమని, రిటైల్ దుకాణాలతో పోలిస్తే తక్కువ లైసెన్స్ ఫీజు నిర్ణయించారని ఆయన చెప్పారు. లైసెన్స్ ఫీజు 50వేల జనాభా వరకు 35 లక్షల రూపాయలు కాగా, 50వేల పైన 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాలకు 55 లక్షల రూపాయల లైసెన్స్ ఫీజు, 5 లక్షల పైబడి జనాభా ఉన్న ప్రాంతాలకు 75 లక్షల రూపాయల లైసెన్స్ ఫీజు ఉంటుందని సుధీర్‌బాబు చెప్పారు. బార్లు ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరచుకునేలా అనుమతులు ఉంటాయని ఆయన తెలిపారు.

# కలెక్టరేట్‌లో ఫౌంటైన్ సర్కిల్, సువిధ కాంప్లెక్స్ ప్రారంభం



జాతీయ చిహ్నం సర్కిల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, అధికారులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్‌లో సుందరీకరణలో భాగంగా జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటేన్‌తో కూడిన పార్కు, సువిధ శానిటరీ కాంప్లెక్స్‌ను జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ముఖ ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు జాతీయ చిహ్నం సర్కిల్‌ను నవీకరించామని తెలిపారు. పార్కులో పచ్చదనం, అహ్లాదకర వాతావరణం కల్పించేందుకు రకరకాల అలంకరణ మొక్కలు నాటినట్లు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సువిధ శానిటరీ కాంప్లెక్స్‌ను నిర్మించామని చెప్పారు. కలెక్టరేట్ ప్రాంగణం అందంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.వి నవ్య, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, డిపిఓ భాస్కర్, ఏఓ శివరాముడు, సువిధ శానిటేషన్ సంస్థ అధిపతి సంజయ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో వైభవంగా మల్లన్నకు వెండి రథోత్సవం



**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం వెండి రథోత్సవాన్ని వైభ వంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అన ంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాల తో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆశీనులను చేసి,అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అధికారులు,అర్చక స్వాములు పాల్గొన్నారు.

**లోక కల్యాణార్థం శ్రీశైలం పంచమఠాలలో పూజాధికాలు :** లోక కల్యాణార్థం శ్రీశైలం క్షేత్ర పరిధిలోని పంచమఠాలలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం,విభూతిమఠం, రుద్రాక్షమఠం,సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక స్వాములు పాల్గొన్నారు. **మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ :** ద్వాదశ జ్యోతిర్లింగం,అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన సోమవారం శ్రావణమాసం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు శ్రీశైలానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.నిత్య కళారాధన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

# ప్రజా ఫిర్యాదులకు చట్టపరంగా న్యాయం చేస్తాం

**- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో టుటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన్నున ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 83ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ఎస్పీ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

# బంగారు గొలుసు దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్టు



పట్టుబడిన దొంగలను మీడియాకు చూపుతున్న సిఐ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తబస్టాండ్ ఆత్మకూరు ప్లాట్ ఫారం వద్ద ఈ నెల 7వ తేదీన విమలమ్మ అనే మహిళ బ్యాగ్ దొంగతనం చేసిన కేసులో ముద్దాయిలు షేక్ ఖాజాబీ, షేక్ ఫరీదాలను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచినట్లు 4వ పట్టణ సిఐ విక్రమసింహా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం క్యాతూరు గ్రామానికి చెందిన విమలమ్మ అనే మహిళ బ్యాగులో రూ.3లక్షల20వేలు విలువ చేసే 4తులాల బంగారాన్ని షేక్ ఖాజాబీ, షేక్ ఫరీదాలు దొంగిలించినట్లు తెలిపారు. విమలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ మోహన్ కిషోర్ కుమార్ రెడ్డి, మహిళా ఏఎస్ఐ, క్రైం పార్టీ సిబ్బంది కలిసి దర్యాప్తు చేపట్టగా కొత్త బస్టాండ్ వద్ద అనుమానస్పదంగా ఇద్దరు మహిళలు తిరుగుతున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారని తెలిపారు. వారి వద్ద నుండి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని ఇరువురిని కోర్టుకు హాజరు పరచగా కోర్టు వారికి రిమాండ్ విధించిందని సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో బస్టాండ్, రైల్వే స్టేషన్లలో జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానస్పద వ్యక్తులను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో క్రైం పార్టీ పోలీసులు మురళీ, ఎల్లా శివుడు, సుబ్బరాయుడు, జీనస్‌లు పాల్గొన్నారు.